# ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎల్లారెడ్డి సింగిల్ విండో సీఈవో సందీప్‌కుమార్

ఎల్లారెడ్డి రూరల్, అక్టోబర్ 31: మండలంలోని ఆరు గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను మంగళవారం ప్రారంభించినట్లు సింగిల్ విండో ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ తెలిపారు. ముంబోజీపేట్, లింగంపేట్, భవానీపేట్, జల్దిపల్లి, కోమటిపల్లి, పోతాయిపల్లి గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామని చెప్పారు. రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని, ఏ గ్రేడ్ ధాన్యాన్ని రూ.2,203, బీ గ్రేడ్ ధాన్యాన్ని రూ.2,183 క్వింటాలు చొప్పున కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. రైతుల బ్యాంకు ఖాతాల్లో డబ్బులను వెంటనే జమ చేయడం జరుగుతుందన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనుగోలు కేంద్రాల్లో ఏర్పాట్లు చేశామని చెప్పారు. కార్యక్రమంలో ఆయనతోపాటు సిబ్బంది పరంధాములు, మోహన్, రాజేందర్, దుర్గాప్రసాద్, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

# ముమ్మరంగా వాహనాల తనిఖీ





పెద్దకొడప్‌గల్‌లో జాతీయ రహదారిపై కారును తనిఖీ చేస్తున్న పోలీసులు

పెద్ద కొడప్‌గల్/ పిట్లం/ తాడ్వాయి, అక్టోబర్ 31: పెద్దకొడప్‌గల్ మండలంలోని జాతీయ రహదారిపై ఎఫ్‌ఎస్‌టీ టీం ఇన్‌చార్జి, ఇన్‌చార్జి ఎంపీడీవో బ్రహ్మం ఆధ్వర్యంలో పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ఎంపీడీవో మాట్లాడుతూ.. ఎన్నికల నిబంధనలు అమలులో ఉన్నందున రూ.50వేలకు పైగా నగదును తరలించే వారు వాటికి సంబంధించిన ధ్రువ పత్రాలను వెంట ఉంచుకోవాలని సూచించారు. సరైన పత్రాలు లేకుంటే వాటిని సీజ్ చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ వెంకటేశం, జీవన్ తదితరులు పాల్గొన్నారు.

పిట్లంలోని జాతీయ రహదారిపై ఎన్నికల తనిఖీ బృందం అధికారులు మంగళవారం వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి సూర్యకాంత్ మాట్లాడుతూ.. వాహనదారులు తనిఖీ బృందానికి సహకరించాలన్నారు. ఎన్నికల నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ఆయనవెంట పోలీసు సిబ్బంది ఉన్నారు.

తాడ్వాయి మండలంలోని క్రిష్ణాజివాడి గ్రామ సమీపంలో మంగళవారం సాయంత్రం కామారెడ్డి-ఎల్లారెడ్డి రహదారిపై పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహించారు. ఎన్నికల నిబంధనలు పాటించాలని వాహనదారులకు ఎస్సై ఆంజనేయులు సూచించారు. వాహనాల్లో డబ్బులు తరలించే వారు పూర్తి వివరాలు వెంట ఉంచుకోవాలన్నారు.

## బీఎస్పీ ఎల్లారెడ్డి నియోజకవర్గ ఇన్‌చార్జి రాజీనామా

ఎల్లారెడ్డి, అక్టోబర్ 31: బహుజన సమాజ్ పార్టీ(బీఎస్పీ) ఎల్లారెడ్డి నియోజకవర్గ ఇన్‌చార్జి పదవికి అట్కారి బాబు మంగళవారం రాజీనామా చేశారు. కొంతకాలంగా తాను ఇన్‌చార్జి పదవిలో కొనసాగుతున్నా.. వ్యక్తిగత కారణాలతో రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు. ఎవరితో తనకు ఇబ్బంది లేదని, ఎవరూ అపార్థం చేసుకోవద్దని ఆయన పేర్కొన్నారు.

## ఇంటి పన్ను వసూలు

ఎల్లారెడ్డి రూరల్, అక్టోబర్ 31: మున్సిపల్ సిబ్బంది పట్టణంలో ఇంటి పన్ను వసూలు చేశారు. పట్టణంలోని ఇండ్లు, వ్యాపార సముదాయాలకు సంబంధించిన పన్ను వసూలు చేసి రసీదులు అందజేశారు. మంగళవారం మొత్తం రూ.25వేల పన్ను వసూలు చేసినట్లు బల్దియా సిబ్బంది తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కారోబార్ దేవదాస్, సిబ్బంది రాజు, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

# 108 వాహనంలో మహిళ ప్రసవం



బిడ్డను కుటుంబీకులకు అప్పగిస్తున్న 108 అంబులెన్స్ సిబ్బంది

గాంధారి, అక్టోబర్ 31: పురిటి నొప్పులతో బాధపడుతున్న గర్భిణిని 108 అంబులెన్స్ వాహనంలో తరలిస్తుండగా.. మార్గమధ్యంలో బిడ్డకు జన్మనిచ్చిన ఘటన మండలంలో చోటుచేసుకున్నది. 108 అంబులెన్స్ సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గుడివెనుక తండాకు చెందిన సోని అనే గర్భిణికి పురిటినొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108 అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చారు. అంబులెన్స్ సిబ్బంది అక్కడికి చేరుకొని గర్భిణిని కామారెడ్డి ప్రభుత్వ దవాఖానకు తరలిస్తుండగా.. మార్గమధ్యంలో మగబిడ్డకు జన్మనిచ్చింది. ప్రస్తుతం తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారని, వైద్య పరీక్షల నిమిత్తం వారిని కామారెడ్డి ప్రభుత్వ దవాఖానలో చేర్పించినట్లు 108 అంబులెన్స్ సిబ్బంది కమలాకర్, నరేశ్ తెలిపారు. 108 సిబ్బందికి గర్భిణి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

# జీపీ భవన నిర్మాణ పనులు వేగవంతం చేయాలి



కంబాపూర్‌లో గ్రామ పంచాయతీ భవన నిర్మాణాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో వెంకటేశ్వర్

పిట్లం, అక్టోబర్ 31: మండలంలోని కంబాపూర్ గ్రామపంచాయతీ భవన నిర్మాణ పనులు వేగవంతం చేయాలని ఎంపీడీవో వెంకటేశ్వర్ అన్నారు. నిర్మాణ దశలో ఉన్న గ్రామపంచాయతీ భవనాన్ని ఆయన మంగళవారం పరిశీలించారు. పనులను నాణ్యతతో సకాలంలో పూర్తిచేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. అనంతరం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో మరుగుదొడ్ల నిర్మాణం, ఎన్నికల పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. పోలింగ్ కేంద్రంలో అన్ని వసతులు కల్పించాలన్నారు. ఆయన వెంట ఏపీవో శివకుమార్, పంచాయతీ కార్యదర్శి తుకారాం ఉన్నారు.

# అనుమానాస్పద స్థితిలో విద్యార్థిని మృతి



వసుధ(ఫైల్)

మద్నూర్, అక్టోబర్ 31: మండలంలోని పెద్ద ఎక్లారా గేటు వద్ద ఉన్న గురుకుల బాలికల కళాశాలలో అనుమానాస్పద స్థితిలో విద్యార్థిని మృతి చెందింది. కళాశాల ప్రిన్సిపాల్ సవిత తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. బిచ్కుంద మండలం మాన్యాపూర్ గ్రామానికి చెందిన వసుధ (16) ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్నది. దసరా పండుగకు ఇంటికి వెళ్లింది. సోమవారం సాయంత్రం ఆమె తల్లి తీసుకువచ్చి వదిలి పెట్టింది. రాత్రి భోజనం చేయడానికి పిలిస్తే ఇంటి వద్దే తినివచ్చానని తెలిపింది. మంగళవారం ఉదయం బ్రేక్‌ఫాస్ట్ చేయడానికి పిలిచినా జ్వరంగా ఉందని తెలిపింది. క్లాసులో అటెండెన్స్ తీసుకుంటున్న సమయంలో సైతం వసుధ లేకపోవడంతో అన్ని గదులు వెతకగా చివరలో ఉన్న డార్మిటరీ రూమ్‌లో ఫ్యాన్‌కు ఉరివేసుకొని కనిపించింది. తల్లిదండ్రులు, గ్రామస్తులు, విద్యార్థి సంఘాల నాయకులు వచ్చి అమ్మాయికి ఏం జరిగిందో చెప్పాలని డిమాండ్ చేశారు. డీఎస్పీ జనార్దన్‌రెడ్డి, ఆర్డీవో భుజంగ్‌రావు, సీఐ కృష్ణ కళాశాలకు చేరుకొని వివరాలు సేకరించారు. విచారణ చేపడ్తామని సంయమనం పాటించాలని తల్లిదండ్రులతో పాటు గ్రామస్తులకు తెలిపారు. ప్రిన్సిపాల్, సిబ్బందిపై తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారని ఎస్సై కృష్ణారెడ్డి తెలిపారు.

# కేటీఆర్ సభ ఏర్పాట్ల పరిశీలన



దోమకొండలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

దోమకొండ, అక్టోబర్ 31: మండల కేంద్రంలోని జూనియర్ కళాశాల ప్రాంగణంలో బుధవారం నిర్వహించే కేటీఆర్ బహిరంగ సభ ఏర్పాటు పనులను బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు గండ్ర మధుసూదన్‌రావు బీఆర్ఎస్ నాయకులతో కలిసి మంగళవారం పరిశీలించారు. అనంతరం మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు గండ్ర మధుసూదన్‌రావు మాట్లాడుతూ.. ఉమ్మడి మండలాల ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు ఎక్కువ సంఖ్యలో పాల్గొని సభను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ తిర్మల్‌గౌడ్, ఎంపీపీ శారదా నాగరాజు, సీడీసీ చైర్మన్ నర్సయ్య, సర్పంచ్ అంజలీ శ్రీనివాస్, సొసైటీ చైర్మన్లు నాగరాజ్‌రెడ్డి, తిరుపతిగౌడ్, బీఆర్ఎస్ నాయకులు కిషన్‌రెడ్డి, రమేశ్, పోశయ్య, శ్రీనివాస్, రవికుమార్, నర్సింహులు, రాజు, గంగాధర్, రవి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

కామారెడ్డి రూరల్, అక్టోబర్ 31: కామారెడ్డి శివారులో లారీ కారును ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందగా నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. దేవునిపల్లి ఎస్సై రాజు తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డి శివారులోని 44వ నంబర్ జాతీయ రహదారిపై మంగళవారం ఉదయం మహారాష్ట్ర నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న కారును లారీ ఢీకొట్టింది. కారులో ప్రయాణిస్తున్న వ్యక్తి మృతి చెందగా.. వివరాలు తెలియాల్సి ఉందని ఎస్సై తెలిపారు. మరో నలుగురికి తీవ్ర గాయాలు కాగా కామారెడ్డి ఏరియా దవాఖానకు తరలించామన్నారు. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌కు తరలించినట్లు తెలిపారు. మృతదేహాన్ని కామారెడ్డి దవాఖాన పోస్టుమార్టం గదిలో ఉంచినట్లు ఎస్సై తెలిపారు.

## నేడు మంద కృష్ణమాదిగ రాక

ఎల్లారెడ్డి, బాన్సువాడ, అక్టోబర్ 31: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ ఎల్లారెడ్డి పట్టణానికి బుధవారం వస్తున్నారని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి పద్మారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎల్లారెడ్డిలోని ఇందిరానగర్‌లో నిర్వహించే సన్నాహక సదస్సులో ఆయన పాల్గొంటారని, ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

పాత బాన్సువాడలోని ఎస్సీ వాడలో నిర్వహించే కార్యక్రమానికి మంద కృష్ణ మాదిగ విచ్చేస్తున్నారని ఎమ్మార్పీఎస్ జిల్లా సీనియర్ నాయకుడు గరుగల బాలరాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శీతాకాల సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాలని కోరుతూ 18న హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో విశ్వరూప మహాసభను నిర్వహిస్తామని ఆయన తెలిపారు.

### సీఎం కేసీఆర్ భారీ మెజార్టీతో గెలువాలని

# ఎల్లమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు



ఎల్లమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న తిప్పాపూర్ గ్రామ బీఆర్ఎస్ నాయకులు

భిక్కనూర్, అక్టోబర్ 31 : సీఎం కేసీఆర్ భారీ మెజారిటీతో గెలవాలని భిక్కనూర్ మండలంలోని తిప్పాపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు సిద్దిపేట్ జిల్లా నిజాంపేట మండలంలోని ఎల్లమ్మ ఆలయం వద్ద మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ స్వామి, ఎంపీటీసీ సాయిరెడ్డి, సొసైటీ చైర్మన్ వెంకటరెడ్డి, ఎండోమెంట్ చైర్మన్ సిద్ధరాములు, వీడీసీ వైస్ చైర్మన్ రత్నం, మాజీ ఎంపీటీసీ రాజయ్య, నాయకులు కామలాకర్, రాజయ్య, ప్రభాకర్, మాణిక్యం, రైతులు తదితరులు పాల్గొన్నారు.